# నాకు నచ్చిన కథ మాస్టర్ పీచు.........

ఎంగిలి చేత్తో కాకిని విదిలించడానికి వెనకాడేవాడు కోట్ల రూపాయలు కుమ్మరించి ఓ మదర్‌థెరిసా పెయింటింగ్ని కొనుక్కోడానికి తహతహలాడిపోవచ్చు. 'కూసింత కలాపోసన' వుండాలని తలపోయవచ్చు. అది సహజం! కాని ఇంకోరకమైన కళాపోషణ కూడ లేకపోలేదు. ముఖ్యంగా చిత్రకళాపోషణలో ఈలాంటి మహారాజకళాపోషకులూ అభిమానులూ వుంటారు. సమాజం గుర్తించిన గొప్పదనాన్ని గుర్తించడానికి యెగబడి దూసుకుపోతుంటాం. ఓ కవినో, ఓ కళాకారుడినో వున్నట్టుండి ఆహా...ఓహో అని సమాజం అన్నదనుకోండి, ఆ తర్వాత అతడెలాంటివాడైనా సరే మనం కూడా 'సాహో' అనకపోతే లోకం ఏమనుకుంటుందోనని భయం! మన అజ్ఞానం బయట పడిపోతుందని అనుకుంటాం. 'మాస్టర్ పీస్'ల విషయంలో ఇది మరీ ఎక్కువ. అలాంటి ఓ 'మాస్టర్ పీచు' కథే ఇది.

చలసాని ప్రసాదరావు స్వయంగా చిత్రకారుడు కాబట్టి చిత్రకళా రాజకీయాలు ఆయనకు తెలుసు. అయితే ఈ 'మాస్టర్ పీచు' కేవలం చిత్రకళ గురించే అనుకుంటే పొరపాటు. చలసాని కథకి తీసుకున్న వృత్తం అంతే కావచ్చు కానీ ఈ మొత్తం కథా కమామిషు సాహిత్య రంగానికి కూడా సమానంగా వర్తిస్తుంది. దేవతావస్త్రాల్లాంటి కవిత్వ చమత్కారాల దెబ్బ తిన్న తెలుగువాడికి ఈ రహస్యం తెలీకపోదు.

తెలుగు కథకుల్లో సెటైర్‌ని నిజంగా కొరడాలా ఝుళిపించగల సత్తా వున్న అతి కొద్ది మంది రచయితల్లో చలసాని ప్రథమపంక్తిలో వుంటారు. తెలుగువాడికి ఎత్తిపొడుపులూ, దెప్పి పొడవడాలూ తెలిసినంత బాగా నవ్వు నరంలోని హాయి తెలియదు కదా! హాయిగా రాళ్ళూ పూలూ విసురుకుని మనసారా నవ్వుకోగలిగినంత స్వచ్ఛమైన సంబంధాలకు మనం ఏనాడో దూరమయ్యాం. ఏ కన్యాశుల్కాన్నో! ఏ మల్లాదివారినో, ఏ శ్రీశ్రీ ప్రాసక్రీడలనో మరే ముళ్లపూడి కతల్నో తలుచుకున్నప్పుడు తప్ప నవ్వు పుట్టదు. ఆ శ్రేణిలో నిలబడి మన పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వించి ముందు వీపు మీద చరిచినా ఆ తర్వాత గుండెలో ఓ 'జర్క్' ఇచ్చే రచయిత చలసాని. మాస్టర్ పీచు... అలాంటి ఓ కుదుపు!

# మాస్టర్ పీచు...

## చల్లసానిప్రసాదరావు

"మన సుబ్రావ్‌గాడు ఈ కళాఖండం ద్వారా మన మట్టి బుర్రల్లోకి ఎక్కించదలచిన మహత్తర సందేశం ఏమిటంటావు?" రావు నుద్దేశించి అడిగాడు దాసు.

రావు బుర్ర గోక్కోలేదు. కళ్ళజోడు సవరించలేదు, ఎదురుగా ఉన్న పెయింటింగును గానీ, పై కప్పునుగానీ పరిశీలించటం లాంటివేమీ చేయలేదు. అతని చూపులు అల్లంత దూరాన ఓ శిల్పం ముందున్న ఇద్దరమ్మాయిల మీదనున్నాయి. ఆ చూపులు నిశితంగా వారి సౌందర్యాన్ని ఎక్స్‌రే తీస్తున్నట్లున్నాయి.

ఆర్ట్ గ్యాలరీలో డజన్లకొద్దీ ట్యూబ్ లైట్లు వెలిగిపోతున్నాయ్! వాటి క్రింద ఓ నలభైదాకా రంగురంగుల పెయింటింగులు మెరిసిపోతున్నాయ్!

ఆ నలభైలోనూ మూడు సుబ్బారావువి. అతను ఎంతో కొంత పేరున్న చిత్రకారుడే! ఆ మూడింట్లోనూ ఒకదానికి వెయ్యి రూపాయల 'అవార్డ్' వచ్చింది. ఆ పెయింటింగ్ గురించే అడిగాడు దాసు. ఎగ్జిబిషన్లో ఆ అవార్డ్ రావడం అంటే "ఈ దేశంలోని ఈ సంవత్సరపు ఆర్టులోకెల్లా అత్యుత్తమ కళా ఖండం ఇది!" అని చాటి చెప్పటమే. ఓ మంత్రిగారు "తృతీయ పంచవర్ష ప్రణాళిక - కళాభివృద్ధి - అది ఎటుల జరగగలదు" అనే అంశంపై అనర్గళంగా ఉపన్యసించి స్వహస్తాలతో సుబ్బారావుకు వెయ్యిరూపాయల చెక్కు అందించి, బరువైన దండొకటి వేసి, షేక్‌హాండ్ ఇచ్చి ఇంకా రెండు గంటలన్నా కాలేదు.

ఆ చిత్రానుద్దేశించే అడిగాడు దాసు. కానీ, రావు పలకలేదు. కనీసం ఇటు చూడనన్నా లేదు.

"మనవాడికి ఈ పెయింటింగులకన్నా ఆ ఆడపిల్లలే కళాత్మకంగా ఉన్నట్లున్నారు!" అన్నాడు మూర్తి.

"మంత్రిగారు తెగ పొడిగిన వెయ్యిరూపాయల కళాఖండం కళ్ళెదుట ఉండగా రావుగారు ఇలా ఆ ముసలమ్మాయిల్ని చూస్తూ గుటకలు మింగుతూండటం కళారంగానికే ఇన్సల్ట్!" అన్నాడు రాజు.

రావు ఉడుక్కోలేదు. ఎదురుగా సజీవ శిల్పాలు కదలాడుతూండగా చూసి సంతోషించలేని మీ కళాభిమానం తగలెయ్య! ఏముందోయ్, ఈ సుబ్రావ్‌గాడి పెయింటింగులో? అన్నాడు నిర్లక్ష్యంగా!

"అక్షరలక్షలు చేసే మాట సెలవిస్తివిరా రావూ? నువ్వో ఎగ్జిబిషన్ పెట్టి అందులో ఇలాంటి అమ్మాయిల్ని కళాత్మకంగా వేలాడదీయరాదురా? చూసి తరిద్దుము గదా?" అన్నాడు దాసు.

"నా సంగతికేం గానీ. పోనీ నువ్వు చెప్పరాదురా మూర్తీ? నువ్వో ఎగ్జిబిషన్ పెట్టి అందులో ఇలాంటి అమ్మాయిల్ని కళాత్మకంగా వేలాడదీయరాదురా? చూసి తరిద్దుము గదా అన్నాడు దాసు.

"నా సంగతికేంగానీ. పోనీ నువ్వు చెప్పరాదురా మూర్తీ? ఈ కళాఖండం లోతుపాతులు? రోజు సాయంత్రం సుబ్రావ్‌గాడితో కలిసి ఒన్‌బైటూ కాఫీ త్రాగి ఈరానీ హోటల్లో ఆర్టును గురించి ఉపన్యాసాలిస్తుంటావు గదా?" అన్నాడు రావు.

సుబ్బారావు ఈ నలుగురికీ కూడా పరిచయస్తుడే. మూర్తికి మాత్రం మంచి మిత్రుడు?

"ఏమైనా సుబ్రావ్‌లో ఈ మధ్య కొంత ప్రోగ్రెస్ కనిపిస్తోందిలే." అన్నాడు మూర్తి!

"అవునవును! ఈ మధ్య వాడు గడ్డం, మీసాల్లో చాలా అభివృద్ధి కనిపిస్తోంది సుమా! ఈ మధ్య దూరాన్నుంచి చూసి పోల్చుకోలేకపోయాను!" అన్నాడు దాసు.

"వాడి వేషంలాగే వాడి కళాఖండాలూ గుర్తుపట్టటం కష్టమయిపోతుందిలే? ఇంతకీ ఈ మాస్టర్ పీస్ మనకిచ్చే మహత్తర సందేశం ఏమిటంటారూ?" ప్రశ్నించేడు రావు.

ఎదురుగా సుబ్బారావు పెయింటింగ్ ట్యూబ్ లైట్ల పాల వెలుగులో కాంతులు విరజిమ్ముతోన్నట్లుంది. ఆ నలుగుర్లోనూ మూర్తి ఇక్కడే కాస్త ఆర్టును గురించి దాటీగా మాటాడగలవాడు.

"ఏముంటుంది? మీరు ఇలాగే రంగ ఖర్చుపెట్టి కాన్వాసులు ఖరాబుచేసి అవార్డు


నాకు నచ్చిన కథగురించి
పాఠకులు విశ్లేషణ రాసి పంపితే
ప్రచురిస్తాం. తగిన విశ్లేషణకు
పారితోషికం ఉంటుంది
CHAITANYA

వెయ్యేసి రూపాయలూ సంపాదించండి! అని కావచ్చు!" అన్నాడు రాజు.

"వెయ్యికాదు! రెండువేలు అను! ఇందాక మ్యూజియం వాళ్ళు వచ్చి కొనేందుకు సెలక్టు చేసిన వాటిలో ఈ పెయింటింగ్ కూడా ఉంది. దీని ధర వెయ్యి రూపాయలు!" అన్నాడు దాసు.

"వారేవా! ఈ రాత్రికి సుబ్రావ్‌గాడిచేత వాట్ బుడ్డీ ఖాళీ చేయించకుండా కదలగూడదు.?" అన్నాడు మూర్తి.

"వాస్సెవ్స్ మా స్కూల్ పిల్లకాయులు కళ్ళుమూసుకొని రుద్దగలరు ఈ మాత్రం కళాఖండాలు!" అన్నాడు రావు.

"తగ్గరా, నాయునా! పిల్లగాళ్ళు కళ్ళు మూసుకుని వెయ్యగల కళాఖండాన్ని ఆర్టు కాలేజీల్లో అయిదారేళ్ళు తలక్రిందులుగా తపస్సు చేసిన కళాకారులు వేయగలగటం అంత తేలికేం కాదు!" అన్నాడు మూర్తి.

"అసలు ఏ ఆర్టిస్టయినా చిత్రాలు ఎందుకు వేస్తాడంటారూ?" ప్రశ్నించాడు దాసు.

"తిన్నది అరక్క.?" అన్నాడు రావు.

"ఇంకెందుకు? ఆత్మ సంతృప్తికే?" అన్నాడు రాజు.

"ఈ ఎగ్జిబిషన్లో అవార్డుల్తో మన ఆర్టిస్టుల ఆత్మలు శాంతించి నిద్ర పోతున్నాయునా?"

"ఏమైనాగానీ, అసలు ఆత్మశాంతికని గీసేవాడూ, రాసేవాడూ అదేదో వాడి ఆత్మలోనే ఏడవక ఇలా ఇంత డబ్బు తగలేసి రంగుల, కాన్వాసులూ, ఫ్రేములు పాడుచెయ్యటం........"

"ఆ తర్వాత ఎగ్జిబిషన్లకు పంపి ప్రైజు కోసం పైరవీలు చెయ్యటం, జడ్జీలకు టైర్లు కొడుతూ తిరగటం........"

"రాకపోతే ఏడవటం.... ఎందుకూ.......?" రెట్టించేడు రావు.

"మరి ఎగ్జిబిషన్లలో కాకుంటే మీరంతా చూసేదెలాగోయ్?" ప్రశ్నించేడు మూర్తి.

"చూసి?......"

"తరించటం.... లేకుంటె ఆస్ప్రో కంపెనీ వాడి లాభాలు పెంచటం?"

మరీ అంత తేలిగ్గా నోరుజారేయకండోయ్? కళల్ని ఆస్వాదించాలంటే కొంతన్నా అనుభవం కావాలి! కళాదృష్టి అలవరచుకోవాలి! అన్నాడు మూర్తి.

"అవును సుమా! రోజూ మా బామ్మ తెల్లారే చన్నీళ్ళు స్నానం చేసి చాలా సేపు ఏదో గొణుగుతూ కూర్చుంటుంది. ఎంత విన్నా నాకది అర్థంగాక మా అమ్మనడిగితే ఆవిడ శివస్తోత్రం చదువుతుందిరా అంది. నిజమే అనుభవం ఉంటేగాని ఏదీ అర్థం అయి చావదు. ఆ దేవుడికి కూడా ఈ అనుభవం ఉన్నట్టులేదు. మా బామ్మకు ఇంతవరకూ ప్రత్యక్షం కానే లేదు!" అన్నాడు రావు

"అయితే ఈ ప్రైజులిచ్చేవాళ్ళూ, వాటిని ఇప్పించే జడ్జీలూ, వాటిని పంచిపెట్టిన మంత్రులూ వీళ్ళంతా ఆస్ప్రో కంపెనీ ఏజంట్లంటావేమిట్రా?"

"అబ్బెబ్బే! ఏదో ఓ చిన్న ఎన్టీవోగాడిని! అంత పచ్చి నిజాలు నేనెలా ప్రవచించగలను!"


"అంత తేలిగ్గా కొట్టెయ్యకండోయ్! ఈసారి వచ్చిన జడ్జీలు సామాన్యులేం గారు! తల నెరిసిన, పండ్లూడిన ఆర్ట్ క్రిటిక్కులు! కలకత్తా, ఢిల్లీ, బాంబేల్నుంచి తలా ఒకరూ వచ్చారు!"

"రైల్లో కూడా కాదు! విమానాల్లో!" అందించాడు రాజు.

"అయితే విమానాల్లో తిరిగేవాళ్ళు మహా మేధావులన్నమాట!"

"అక్షరాలా! ఈ మధ్య చాలా విమానాలు దార్లోనే చతికిలపడుతున్నవి వారి విజ్ఞానాన్ని మొయ్యలేకనే!"

"మన రావుగాడికి ఈ ఆర్టంటే గిట్టదని తెలిసి కూడా వాడితో పోట్లాటెందుకురా?" వారించాడు దాసు.




"మీ కున్నంత కళాహృదయం నాకు లేదుగానీ నన్ను వదిలేసి మీరంతా ఈ కళాఖండాల్ని మేసి సంస్కృతిని ఉద్ధరించండిరా నాయనలారా!" అని తప్పుకున్నాడు రావు.

మూర్తి కాలర్ సర్దుకుని కళ్ళజోడు సవరించుకున్నాడు. "మనకు అర్థం కానంత మాత్రాన ఈ ఆర్టునంతా చెత్త క్రింద జమకట్టటం......." అంటూ ప్రారంభించాడు.

"కాస్త చదువుకున్న అజ్ఞానులం! పైగా సుబ్రావ్‌గాడి దోస్తులం! మనకే అర్థంగాకుంటే మరింకెవరికోసంరా బాబూ ఈ బొమ్మలు?" అడ్డువచ్చాడు దాసు.

"ఏం ఎందుకు అర్థంగావు? సుబ్రావ్ ఈ పెయింటింగ్స్‌లో కొన్ని సింబల్స్ వాడాడు. అవేమిటో ముందు తెలుసుకుంటే సరి!" అన్నాడు మూర్తి.

ఎవరూ మాట్లాడలేదు. ఉత్సాహంతో విజృంభించాడు మూర్తి.

"మీరింకా గుర్తించటంలేదుగానీ, సుబ్రావ్‌గాడు ఈ మధ్య చాలా ఎదిగాడు! మొన్న ఆదివారం సత్యజిత్‌రాయ్ సిన్మాకు కూడా వచ్చేడు!"

"అలాగా! మొన్న మా బామ్మ చేతుల్లో సినిమా పాటల పుస్తకం చూశాను!" అందించాడు రావు.

"నువ్వుండరా నాయునా!" విసుక్కున్నాడు మూర్తి! "ఈ మధ్య సుబ్రావ్ చాలా చదివాడు! వాంగో జీవితం చదివీ, అతని చిత్రాలు ఆల్బంలో చూసీ మనవాడో వారం రోజులపాటు ఈ లోకంలోనే లేడు!"

"కొంపదీసి వాంగోలాగే చెవి కోసుకుని కట్లుకట్టుకుని ఆస్పత్రిలో పడుకోలేదుగ కదా?"

"వాస్సెవ్స్ మాట్లాడకు? ఆ మాటకొస్తే చెవిగానీ, ముక్కు కానీ కోసుకోగల దమ్ములు ఒక్క కళాకారులకే ఉంటాయి!" గద్దించాడు దాసు.

"సరే! మరి సుబ్రావ్‌గాడు చెవి కోసుకోకుండా ఏం చేసినట్టు?" ఉత్సాహం చూపించేడు రావు.

"వేస్తే వీళ్ళందర్ని మించిపోవాలి! లేదా తిని నిద్రపోవాలి! అని తేల్చుకున్నాట్ట?" వివరించేడు మూర్తి.

"శభాష్! మరి తిని నిద్రపోక ఇవన్నీ వేసి మన దుంపలెందుకు తెంపుతున్నట్టు?"

"ఎందుకా? వాడెంతగా ఎదిగాడో నీకెలా తెలియటం? వాడి ఆలోచనలే మారిపోయాయి! విప్లవభావాలు ఎక్కువయ్యేయి!"

ఎదురుగా ఉన్న సుబ్రావ్ పెయింటింగ్ అకస్మాత్తుగా ఓ బాంబుగా మారిపేలినంతగా ఉలిక్కిపడ్డారు ఆ ముగ్గురూ! నమ్మలేనట్లుగా మూర్తివంక సంభ్రమంతో చూసేరు.

మూర్తి మందహాసం చేశాడు. ఈ పెయింటింగులో రంగుల ముద్దలు తప్ప మరేం లేవనేగదా మీగోల! నిజమే! కానీ, అంతా ఆ రంగుల్లోనే ఉంది. కాస్త పరికించి చూడండి.

పై భాగంలో ముద్దముద్దగా చిక్కగా ఉన్న ఆ ఎర్రరంగు ప్రగతికి విప్లవ భావాలకు సంకేతం, తెలుసుగా.......?

"ఆ....ఆ..... అవును?" నసిగేడు దాసు

"మధ్యలో పుసుపురంగులో కలగాపుల గంగా, పెంటకుప్పలా కనుపిస్తున్నదే..... అది మన చుట్టూ ఉన్న ఈ సమాజానికి సింబల్ "

"ని.....న్ని.....న్నిజమే?......"

"కాకేం! సుబ్రావ్‌గాడేమన్నా నీబోటి ఎన్జీవోగాడనుకున్నావా! వాడీ మధ్య చాలా సీరియస్‌గా, తెగింపుగా ఆలోచిఇస్తున్నాడులే?"

"తర్వాత..........?"

"ఇహ ఈ చిత్రం క్రిందిభాగంలో ఉబ్బెత్తుగా కనపడే నల్లరంగు ఓ బలిసిన పందికి సింబల్!"

"పందా?........ అంటే.......?"

"పంది దేనికి సింబల్ అయిందీ కూడా తెలీదూ." గద్దించేడు మూర్తి.

"పంది పరిశుభ్రతకు చిహ్నం. అవే లేకుంటే మా బెజవాడ ఈ మాత్రం శుభ్రం గానన్నా ఉండేది కాదు!" అందించాడు రాజు.

"నీ జోకులకేంగాని, విను," ఉపక్రమించేడు మూర్తి. "స్వార్థంకోసం సమాజాన్ని ఖండాలంగా రూపొందవిచ్చి అందుమూలంగా లాభపడాలని చూసే దుష్టవర్గాలకు సింబల్ ఈ పంది!"

"అవునవును?" అడ్డం వచ్చాదు దాసు.

"మా ఆఫీసులో ఓ లావాటి ఆఫీసరుగాడున్నాడు! ఎవరికీ దక్కకుండా మామూళ్ళన్నీ వాడే మింగుతాడు. అందుకని అందరూ కలిసి వాడికి 'సీమపంది' అని బిరుదిచ్చేరు."

"అదలా ఉండనీ!" విసుక్కున్నాడు మూర్తి. ఆ నల్ల పంది ఈ పసుపు సమాజాన్ని లద్దుండలా మింగేయాలని చూస్తోంది. ఈ సందర్భంలో ఆ నలుపుకూ ఈ ఎరుపుకూ జరిగే సంఘర్షణను ప్రదర్శించటమే ఈ చిత్రంలో 'సుబ్రావ్ చేసింది!

రాజు, దాసు తృప్తిగా తలలూపేరు.

"నువ్వన్నట్లు ఆశల్ని అర్థంజేసుకోవాలంటే కాస్త అనుభవం ఉండాల్సిందే!" అన్నాడు రాజు.

"సరేగానీ, ఇదంతా సుబ్రావ్‌గాడే చెప్పాడా? లేక నీకే తట్టిందా?" అనడిగేడు దాసు.

కళ్లజోడు సవరించుకున్నాడు మూర్తి. "ఈ మాత్రానికి వాడిని అడగాలా! వాడి పెయింటింగ్‌కు పెట్టిన పేరు చూస్తే తెలీటంలా?"

"మాకు తట్టలేదు సుమా? 'సంఘర్షణ' అంటే ఇదన్నమాట! మొత్తం మీద ఈ పెయింటిగ్‌తో బాగానే సంఘర్షించావులే!"

అందరూ రాజీ కుదిరినట్టుగా, బరువు తగ్గినట్టుగా కదిలేరు.

ఆ చర్చలోంచి బయటపడిన రావుకు ఇందాకటి సజీవ కళాఖండాలెక్కడా కనుపించ లేదు.

వాళ్లు కళాస్వాదనతో కదుపునింపుకునో, కడుపునొప్పితోనో ఎప్పుడో బయటకు పోయినట్లున్నారు. హాల్లో జనం దాదాపు లేరు.

అటుగా వరండాలోకి చూసిన రావుకు అటే వస్తూన్న సుబ్రావ్ కనుపించేడు.

"నూరేళ్ళాయుష్షు. రావోయ్!" కేకేశాడు మూర్తి.

ముసిముసి నవ్వుల్తో వెయ్యిరూపాయల వాయినం ముట్టిన పెళ్ళికొడుకులా లోపలికొచ్చేడు సుబ్బారావు.

"నీ పెయింటింగ్‌ను వీళ్ళకు అర్థమయ్యేలా చెప్పలేక చచ్చాననుకో. మొత్తంమీద చాలా ఎదిగావోయ్?" అన్నాడు మూర్తి.

"కంగ్రాచ్యులేషన్స్!" అన్నారందరూ ఏకగ్రీవంగా.

"థాంక్స్" అంటూ అందరికీ షేక్‌హ్యాండిచ్చేడు సుబ్బారావు. "ఆ ప్రైజు వచ్చిన పెయింటింగునే మ్యూజియం వాళ్ళు వెయ్యి రూపాయలకు కొనేశారు. ఇంత సేపు వాళ్ళతోనే మాట్లాడుతున్నాను!" అంటూ తృప్తిగా, గర్వంగా ఆ పెయింటింగుకేసి యథాలాపంగా చూసుకొని ఉలిక్కిపడ్డాడు.

"పదండి కాఫీ త్రాగుదాం! ఎగ్జిబిషన్ మూసేసే టైమయింది!" అంటూ బయటకి దారితీశాడు.

"కాఫీ ఏమిటి? నాన్సెన్స్! రెండు వేలు కొట్టేసి కనీసం బీరుబుడ్డీ అన్నా ఇప్పించవురా!" ఎగిరేదు మూర్తి.

"ఓ! అలాగే?" అంటూ వాళ్ళతో కలిసి బయటికొచ్చి మళ్ళీ అంతలోనే ఏదో గుర్తొచ్చినవాడిలా "ఇప్పుడే వస్తా!" నంటూ ఆర్టుగ్యాలరీలోకి నడిచాడు. సుబ్బారావు.

రిసెప్షన్ దగ్గరున్న ఇన్చార్జిని లాక్కుని తన పెయిటింగ్ దగ్గరకు తీసుకొచ్చాడు సుబ్బారావు.

"కనీసం అవార్డు వచ్చిన పెయింటింగు లనన్నా సరిగా వ్రేలాడదీయ వద్దటండీ! ఇంకా నయం! ఎవరూ గుర్తించలేదుగానీ, మీ-నా పరువు గంగలో కలిసి ఉండును!" అంటూ ఆ పెయింటింగును తలక్రిందులు చేసి, సరిగా సర్ది చేతులు దులుపుకుంటూ బయటికొచ్చాదు సుబ్బారావు.

ఎరుపు నలుపుల కళాత్మకత, కళాకారుల సింబాలిజంను గురించి వరండాలో తీవ్రంగా చర్చించుకొంటున్న ఆ నలుగుర్నీ తోలుకుని తేలికైన హృదయంతో బరువుగా ముందుకు నడిచాడు సుబ్బారావు. ●

# మనమంతా ఒక్కటే!

షాజహాన్....

మనుషులు వేరైనా మమత ఒక్కటే!
రాగాలు వేరైనా రావమొక్కటే!
మతము మతము వేరైనా మర్మమొక్కటే!
భాష భాష వేరైనా భావమొక్కటే!

సౌరభాలు వెదజల్లే
విరిబాలల దేజాతి?
విహరించే గగనమందు
విహంగాల దే నీతి?

సముద్రాల చరియించే
జలచరాల దేమికులం?
అలలు అలలుగా తేలే
అనిలాని దేమికులం?

కాలయముని మహారాణి
కాటికున్న దేమి మతం?
చలువకాంతులొాసగే ఆ
జాబిల్లిది ఏమి మతం?

ప్రశ్నించే మనసుంటే
ప్రకృతంత ఒకే కులం
అవగాహన మనకుంటే
అందరిదీ ఒకే మతం

మానవత్వముదయించే
మనిషివి నీవే అయితే....

మత మౌఢ్యం ఎందుకు?
కుల కు డ్యం ఎందుకు?
జాతి జాడ్య మెందుకు?

ఎందుకు ఎందుకు ఎందుకూ?
ఇరుకు గదులు వదలిపెట్టి
ఇరుల రొాదలు తగులబెట్టి
అందరమొకటేనంటూపో
కరుణా కలిత హృదిలో
అనురాగ వీణ సవరించుకో ●